సరస్వతిని తలుచుకుంటేనే పూర్వం తన హృదయమంతా పొంగి పోయేది. కాని ఆభావం ఇప్పుడు రావటంలేదు. సరస్వతితో సహా పట్నం వచ్చిన మొదట్లో ఏ కొద్దికాలం సుఖపడ్డాడో; తరువాతమాత్రం జీవితం ఓ సమస్యగా ఊరిపోయి కూర్చుంది. బట్టలు చిరిగి పోయాయి పూర్తిగా రాజారావు బట్టలే తొడుగుతున్నాడు.

ఆవాళ వాళ్ళ ఊరినించి ఉత్తరం వచ్చింది. సరస్వతి తండ్రి చచ్చిపోయాడని దాంట్లో సారాంశం: అంత ఆదుర్దాగా చదివితే! సరస్వతి ఏడ్చిఏడ్చి అప్పుడే కళ్ళు మూసింది. పరీక్షలు దగ్గరపడ్డాయి. రాజారావు దీక్షగా చదువుతున్నాడు రాత్రింబగళ్లు. అతనికి నిద్రపట్టలేదు. జీవితమంతా మహాసముద్రంలా మారిపోయింది. ఎటు చూద్దామన్నా తీరం కనిపించటంలేదు. అన్నయ్యకి తనమీద ఎందుకంత కోపమో తన కర్థం కావటంలేదు. తను ఊహించినట్లు జరగలేదసలు. సరస్వతికి నిండునెలలు, ఎవరూ తోడు కూడాలేరు. తను ఎంత ధైర్యం చెప్పుకున్నా అది చెదిరిపోతోంది. సంఘం పోకడ విచిత్రంగా వుంటుంది. నిజానికది తననేమీ బాధ పెట్టడం లేదు. కానీ "కొట్టావద్దూ - తిట్టావద్దు - కడుపు మాడిస్తే సరి" అన్నట్లుగా చేస్తుంది. ఎవరూ తనని ఏమీ అనరు. అంతమాత్రంచేత ఎవరూ తన విషయం పట్టించుకొని సహాయపడరు.

(ముగింపు వచ్చేసంచికలో)

# నమ్మకాలు

మధిర భానుమూర్తి

నమ్మకాలనేవి అన్నియుగాలలోనూ అందరు మానవులకూ ఉన్నవే. పూర్వపు యుగాల వారివి మూఢనమ్మకాలనీ తమకలాంటి నమ్మకాలు లేవనీ అనుకునేవారు తమని తాము సరిగా అర్థం చేసుకోలేనివారు అవుతారు. ఈ నమ్మకాలు వ్యక్తులను బట్టి కాలాన్నిబట్టి మారుతవి.

ఈ నమ్మకాలు ఎక్కువగా ఉండటానికి కారణం వ్యక్తుల మనోదౌర్బల్యం. ఒక ఆచారం ఎందుకు ఏర్పడిందో, దానివల్ల కలిగే ఫలితాలేమిటో సరిగా తెలుసుకోకుండా ఆ ఆచారాలను అనుకరించడం మానవస్వభావం. ఇట్టి అర్థంలేని అనుకరణ వల్లనే ఈ ఆచారాలు మూఢనమ్మకాలై విలువలేనివిగా తయారయినై.

భోజనం చేసేటప్పుడు శుభ్రమైన దుస్తులతో ఉండడం ఆరోగ్యానికి మంచిదని గ్రహించి నిత్యం ఉతికినబట్ట కట్టుకోవడం ఒక అలవాటు. రానురాను రోజులు మారేసరికి వీధులవెంట తిరిగి వచ్చిన బట్టలు కాకుండా ప్రత్యేకంగా ఒక పట్టు బట్ట కట్టుకుని భోజనంచెయ్యడం ప్రారంభమైంది. దీని విపరీత పరిణామంగా ఆ నాడు శుభ్రంగా ఉతికినబట్ట మానేసి, నెలలతరబడి నీటిముఖం చూడని మురికికంపుకొట్టే పట్టుబట్టలు కట్టుకోవడంలోకి దిగింది ఈ ఆచారం. ఈ స్థితిలో దీనిని మూఢనమ్మకంగా జమకట్టడం జరిగింది. అసలు ఆచారంలోలేదు ఆ లోటు. దానిని అమలు పరచడంలో ఉంది.

దేవాలయాలకు వెళ్ళేవారిలోకూడా ఇవి కొన్ని ఉన్నాయి. మానవప్రయత్నమేమీ లేకుండా భారమంతా దైవంమీదే పారేసి "నీవే దిక్కు నాయనా! నన్నురక్షించాలి. అశక్తుడిని." అని అంగలార్చేవారు చాలామంది ఉంటారు. విద్యార్థులు సంవత్సరమంతా ఊరూవాడా చక్కబెట్టి తుదిఘడియల్లో భగవత్ప్రార్థనలో మునిగి పోవటం కద్దు. పరీక్షలు ప్రారంభమయే రోజున ఎంత చిన్నదేవుడేనా కనీసం ఒకవంద కొబ్బరికాయలు రుచిచూడనివాడుండడు. ఈ భగవంతుడు మామూలు రోజుల్లో కనిపించడు వీరికి. ఎంత చదవకపోయినా ఆ రోజున భగవంతుడి ముడుపు చెల్లిస్తే తాము తప్పక కృతకృత్యులు కావచ్చునని వీరందరి నమ్మకం. మానవప్రయత్నం ఏమీలేనిది భగవంతుడుమాత్రం ఏంచెయ్యగలడు? పాపం!

అయితే ఈ సత్యాన్ని గ్రహించి ఆచారాలను విస్మరించకూడదా? అన్న ప్రశ్న రావచ్చును. అలా విస్మరించరుకనుకనే వీటిని నమ్మకాలు అనవలసి వస్తూంది. ఈ ఆచారాలను అమలు పరచకపోతే తగనినష్టం తప్పక కలుగుతుందని వీరికొక విశ్వాసం. అందుకనే ఈఆచారాలను (ఏమీఅర్థం చేసుకోకుండానే) అమలుపరుస్తున్నారు. పరీక్షకు వెళ్ళేముందు దేవుడికి కొబ్బరికాయలు కొట్టని విద్యార్థి (తాము ఏమీ చదవకపోవటంవల్ల) పరీక్ష తప్పితే ఆ కొబ్బరికాయి కొట్టకపోవటంవల్లనే తప్పాననుకుంటాడుగాని చదవక పోవటంవల్లనని అంగీకరించడు.

సూరయ్యగారనే ఆయన వందరూపాయలు జేబులోవేసుకుని ప్రయాణమయ్యారు. స్టేషనులో టిక్కెట్టు కొంటూండగా ఒక జేబుదొంగ ఆయన పర్సు కాజేశాడు. సూరయ్యగారు తన్నుతాను మరచి కోటీశ్వరుడి పోజులో ప్లాటుఫారంమీద విహరించకపోతే ఇంత ప్రమాదం వాటిల్లేదికాదు, కాని ఆయన ఆ విషయం ఒప్పుకోరు. తను ఇంటివద్ద బయలుదేరేముందు తనకు ఎదురైన పంతులును తిట్టిపోశారు. ఆ పంతులు ఎదురురావటానికీ ఈ సంఘటనకీ సంబంధంలేదని మిత్రుడొకాయన నచ్చచెప్తే, "లేకపోవడమేమిటి? అసలు ఆపంతులు ఎదురవబట్టే నేనంత అజాగ్రత్తగా ఉండడం జరిగింది స్టేషనులో. లేకపోతే, నేనేమిటి? అజాగ్రత్తగా ఉంరడమేమిటి?" అంటాడు తన అజాగ్రత్తకు కూడా పంతులే కారకుడైనట్టు.

ఈ శకునాలనమ్మకం బాగా ప్రబలంగావుంది ఇప్పటికీ. వేణు ఎక్కడకు వెళ్ళాలన్నా శకునం చూస్తేనేగాని కదలడు. ఒకసారి ఉద్యోగానికని బయలుదేరి వెడుతుంటే వితంతువు ఎదురయేసరికి ఆ ఉద్యోగం కొంచెంలో చెయ్యిజారిపోయిందట. అందుచేత శకునంమంచిదికానప్పుడు ఎంతజరూరు పనైనా వాయిదావేస్తాడు వేణు. మంచి శకునమయాకకూడా అతను తలపెట్టిన కార్యాలుకొన్ని విఫలమవకపోలేదు. కాని వాటిని లెక్కపెట్టడు తను. తన బాధ్యత శకునం మంచిది చూసుకుని బయలుదేరేవరకే! తరువాత ఆ పని కాకపోతే తనేంచెయ్యగలడు? ఇదీ అతనివాదం.

మొట్టమొదటి పరీక్ష వాళ్ళనాన్న రూపాయిపావలా పెన్నుతో వ్రాస్తే ప్యాసయాడుట మహేశం. ఆ నమ్మకంచేత ఏ పరీక్షైనా ఆ పెన్నుతోనే వ్రాసేవాడు. ఒకరోజున ఆ పెన్ను పరీక్షహాల్లో మరిచిపోయాడు. పెన్ను పోయేసరికి బెంగపెట్టుకుని మంచంపట్టాడు.

పేరయ్యగారు మంచి వ్యవహర్త. వడ్డీ వ్యాపారంలో అందెవేసిన చెయ్యి. ఎంతటి ఆస్తినైనా, ఎంతటివాని చేతుల్లోంచైనా క్షణంలో తన పరం చేసుకోగల ప్రజ్ఞావంతుడు. ఆయన మొట్టమొదటి సారిగా ఒక యిల్లు సంపాదించినప్పుడు నోటు వ్రాసిన కలం ఆయన జీవితాంతం ఉంచుకున్నారు. ఆ కలం కాలంతోపాటు పాడవు తగ్గుతూరాగా ఈయన దానికి వెదురుపేళ్లు ముడివేసి కాలక్షేపం చేశారేకాని కొత్త కలం కొనలేదు. కొత్త కలం కొంటే ఆ పాతకలంతో వచ్చిన సిరి దాంతోనే పోతుందని వారు కుమారులతో అనేవారట.

ఆత్మారావు అనే ఆయన పజిల్సు పూర్తిచేసి పంపుతుంటారు తరుచుగా. వారు మొదటవేసిన పజిలు రైల్వేస్టేషనుకు అరమైలుదూరంలోఉన్న కొబ్బరితోటదగ్గర కూచుని పూర్తిచేస్తే పెట్టుబడిమీద పావలా ఎక్కువ వచ్చింది. ఆనాటినుండి నష్టంలేకుండా ఉండేందుకు ఎప్పుడు పజిలు వేసినా ఆత్మారావుగారు ఆ కొబ్బరితోటదగ్గర కూర్చునే పూర్తిచేస్తాడు. మొదటిసారి ఏదో వచ్చిందిగాని దరిమిలాను అతనికి ఏమీ వచ్చినట్టు తోచదు. కాని అతను అక్కడకు వెళ్ళడం మాత్రం మానలేదు.

ఇలాంటి నమ్మకాలు పేకాటలో ఉన్నవారికి చాల ఎక్కువగా ఉంటాయి. నీ ఆప్తమిత్రుడు డబ్బుపెట్టి పేకాడుతుండగా వెళ్ళి అతనిప్రక్కని నుంచుంటే అతను నిన్ను చీదరించుకుంటాడు. (ఎంత మిత్రుడవైనా) అతనికి వచ్చిన నష్టం నువ్వు అతని ప్రక్కని నుంచోటంవల్లనే వచ్చిందనే విషయంలో అతనికి అనుమాన మేమీ ఉండదు.

ఈ నమ్మకాలన్నిటికి ఆధారం వెదకబోతే ఏమీ దొరకదు ప్రత్యక్షంగా. అది వ్యక్తులకు

సంబంధించినది. చిన్న పిల్లలు ఒకసారి దీపపు చిమ్నీమీద చెయ్యివేసి కాల్చుకుంటే మరెప్పుడూ వెయ్యనట్టే ఒకపని చెయ్యడంవల్ల ఒకసారి వచ్చిన ఫలితమే ఆపని ఎప్పుడుచేసినా వస్తుందనే నమ్మకం ఉండడం సహజం.

ఈ నమ్మకాలు వింతవింతగా ఉంటాయి కొన్ని సందర్భాల్లో. తిథుల్లోకల్లా అమావాస్య చెడ్డదని చాలా ప్రతీతి. సాధారణంగా ఏ పనీ ఆ రోజున ప్రారంభించరు. ఒకాయనకు ఉద్యోగంలో అమావాస్యనాడు చేరాలని కాగితం వచ్చింది. బంధువులంతా "ససేమిరా!" అన్నారు. "అంత ఉద్యోగమే దొరక్కపోతుందేమిటి? ఇది కాకపోతే దీని బాబు ఇంకొకటి" అన్నారు అప్తుడొకాయన. కాని ఉద్యోగం పోగొట్టుకునే సాహసంలేక ఆయన వెళ్ళి అమావాస్యనాడు ఉద్యోగంలో చేరారు. ఏ విధమైన లోటు లేకుండా ఉద్యోగం జయప్రదంగా చేసి బయటపడ్డారు. అప్పటినుంచీ ఆయన ఏ కొత్త పనైనా అమావాస్యనాడు ప్రారంభించేవారు. ఇది విన్న ఒకాయన విస్తుపోయాడు బొత్తిగా గొడ్డు అమావాస్యనా డేమిటని.

ముహూర్తాల నమ్మకం ఉన్న వాళ్ళల్లో సర్వేశ్వరం ఒకడు. ముహూర్తాలు చూసుకోకుండా అన్ని పనులూ చెయ్యమని కాదుగాని చేసే ప్రతి పనికీ ముహూర్తం చూసుకోవటం మొదలుపెడితే ప్రపంచం నడకే ఆగిపోతుంది. చొక్కా కుట్టించుకోవడం, ఆఫీసులో జీతం పుచ్చుకోవడం దగ్గరనుంచి వివాహాదికార్యాల దాకా ఏ ఒక్క పనీ ముహూర్తం పెట్టందే చెయ్యడు సర్వేశ్వరం.

ఎక్కడున్నా సరే మంచిది కుదరనిదే బయలుదేర కూడదనే నియమముంది నారాయణగారికి. చుట్టం చూపుగా బంధువుల ఇళ్ళకువచ్చి మంచిది కుదరక నెలల తరబడి అక్కడే ఉండిపోయిన సందర్భాలు అసంఖ్యాకంగా ఉన్నాయి ఆయన జీవితకాలంలో. ఆ బంధువు లింక ఆయనను భరించలేని స్థితి ఏర్పడి ఆయన అక్కడకు వచ్చి చాల రోజులయిందన్న విషయాన్ని ఆయనకు గుర్తుచేస్తే, "నాకు కూడా తెలుసుననుకో! కాని ఎలా వెళ్ళను. ఇంటిదగ్గర వాళ్ళ తంటాలు వాళ్ళు పడవలసిందేగాని నేనేం చెయ్యగలను?... అందుకే నే నసలు ఎక్కడికీ రాను. తీరా వచ్చాక మరి చూస్తూచూస్తూ మంచి తిథి కుదరకుండా ఎలా బయలుదేరడం? నువ్వే చెప్పు పోనీ!" అన్నాడట మాంచి స్థిమితంగా.

ఈ నమ్మకాలు చిన్నచిన్న విషయాల్లోకూడా ఎక్కువగా ఉంటాయి. రావుగారికి ఒక గళ్ళచొక్కా ఉంది. ఆ చొక్కా ఆయన తొడుకున్న రోజున వాళ్ళ వీధిని ఒకాయన మరణించాడు. మరోమాటు తొడుక్కుంటే మరొకస్త్రీ (వృద్ధురాలే అనుకోండి) మరణించింది. ఇలా మూడు నాలుగుసార్లు అయేసరికి రావుగారి గళ్ళచొక్కాకి "చావుల చొక్కా" అని పేరువచ్చింది. అప్పటినుంచీ ఆయన ఆ చొక్కా వేసుకుంటే ఎవరి ప్రాణంమీదికి వస్తుందో అని అందరికీ భయంగానే.

మాకు ఈ మూఢనమ్మకాలు ఏమీలేవని విర్రవీగేవారు ఎందరో ఉంటారు. వారు అవసరమైన పనిమీద వెళ్ళేటప్పుడు ఒక్క తుమ్ముచాలు. ఇట్టే చతికిలబడి పోతారు. దాంతో తేలుతుంది వారికి నమ్మకాలు ఉన్నదీ లేనిదీ. ఆ తుమ్మిన వ్యక్తి జలుబుచేసి తుమ్మినాగాని వీరు ఆ తుమ్ము కార్యాలకు విఘ్నసూచకమనే భావిస్తారు.

ఇలా చెప్పుకుంటుంటే ఎన్నైనా ఉదాహరణలుంటాయి. ప్రతిమానవుడిని ఏదో ఒక నమ్మకం శాశ్వతంగా ఆశ్రయించుకుని ఉంటుంది. ఈ నమ్మకాలు అన్ని కాలాల్లోనూ ఉండేవే. ఎంత వదల్చుకుందామన్నా పోవు. మనకి తెలియకుండానే మనని ఆశ్రయించుకుని ఉంటాయి. ఎదుటివాళ్ళకి మన నమ్మకాలు చూస్తే వేళాకోళంగా ఉంటుంది. మనమట్టుకు మనకి అవన్నీ సహజంగా ఉన్నట్లే కనిపిస్తాయి...